ప్రజాశక్తి




శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 5 కర్నూలు



గర్భిణీలకు సీమంతం నిర్వహిస్తున్న మహిళా కమిషన్ చైర్మన్ వెంకటలక్ష్మి, జెసి నవ్య తదితరులు

నింగికెగిసిన అరుణతార

- కర్నూలుతో ఏచూరికి అనుబంధం - పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగం



2019లో ఎన్ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా కర్నూలులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. సీతారాం ఏచూరికి కర్నూలుతో అనుబంధం ఉంది. పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. చాలా సార్లు ఆయన కర్నూలుకు విచ్చేశారు. 2003 నవంబర్ 30న పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఉన్న ఆయన ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 2009 ఎన్నికల్లో సిపిఎం కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎం.ఎ.గఫూర్ పోటీ చేసిన సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 2013 మే 19న కర్నూలు సుందయ్య భవన్‌లో నిర్వహించిన సుందరయ్య శత జయంతి ఉత్సవాల్లో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులుగా ఆయన పాల్గొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. డాక్టర్స్ మీట్‌లోనూ పాల్గొన్నారు. 2016లో కర్నూలు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిస్టుల బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. 2019 డిసెంబర్ 28న కర్నూలు నగరంలో ఎన్ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శిగా పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు, కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీతారాం ఏచూరి చాలా సందర్భాల్లో కర్నూలుకు వచ్చారన్నారు. 2013 మే 19న కర్నూలులో సుందరయ్య శత జయంతి ఉత్సవాల సందర్భంగా సుందరయ్య విగ్రహావిష్కరణకు హాజరయ్యారన్నారు. సిపిఎం, సిపిఐ ప్రజా సమస్యలపై చేపట్టిన ఉద్యమం సందర్భంగా కర్నూలులో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. కర్నూలులో జరిగిన సభలకు చాలా సందర్భాలలో హాజరయ్యారన్నారు.

ప్రజా సంఘాల సంతాపం..

సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి రాఘవేంద్ర, వై నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి షరీఫ్, చేతి వృత్తిదారుల కమిటీ జిల్లా నాయకులు సి.గురుశేఖర్, కే.రాజు, సి.శ్రీనివాసులు, సి.శేషాద్రి, సి.ముక్కన్న వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశంలో వామపక్ష ఉద్యమానికి తీరని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. ఏచూరి మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్దల సభలో, మేధావుల సభలో ప్రజల శ్వాసగా గొంతు వినిపించారని అన్నారు. అనేక ప్రజా, కార్మిక, శ్రమజీవుల ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు.

దేశ రాజకీయాలకు తీరని లోటు : ఎంపీ నాగరాజు

కర్నూలు క్రైమ్ : రాజకీయాలకు అతీతంగా గుర్తింపు తెచ్చుకున్న నేత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. **పత్తికొండ :** సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం సంతాప సభను పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, పత్తికొండ మండల కార్యదర్శి రంగారెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా నాయకులు రామా నాయుడు, సిపిఐ మండల కార్యదర్శి రాజా సాహెబ్, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ నివాళు లర్పించారు.

ప్రజాశక్తి సిబ్బంది నివాళులు

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ సిబ్బంది నివాళులు అర్పించారు. ఎడిషన్ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి నాయకుడిగా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. బహుబాషా కోవిదుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. డెస్క్ ఇంఛార్జి పానుగంటి చంద్రయ్య మాట్లాడుతూ ఏచూరి జీవితం ఆదర్శనీయమన్నారు. తెలుగు రాష్ట్రాలతో ఏచూరికి ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు.



ప్రజాశక్తి కర్నూలు ఎడిషన్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం మొదటి ప్రతిని చదువుతున్న సీతారాం ఏచూరి, శ్రీనివాస రావు తదితరులు...



ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనరల్ మేనేజర్ నరసింహా, డెస్క్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య, సిబ్బంది తదితరులు

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. ఏచూరి మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఎం కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. చాలా మంది కార్యకర్తలు దు:ఖంతో ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేశారు. సుందరయ్య భవన్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి నారాయణ అధ్యక్షతన జరిగిన సంతాప సభను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారతదేశంలో ఉన్న కొద్ది మంది మేధావులలో ఒకరిని, ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రత్యేకతను చాటిచెప్పిన వ్యక్తి అని తెలిపారు. 2004లో యూపిఎ వన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారన్నారు. పార్లమెంట్‌లో, పార్లమెంటు బయట ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక రకాల సూచనలు, సలహాలు ఇవ్వడంలో ఆయన ముందుండేవారని తెలిపారు. ప్రత్యేకించి కర్నూలు జిల్లా ఉద్యమంతో అనేక సందర్భాల్లో ప్రత్యక్ష సంబంధాలు ఆయనకు ఉన్నాయని తెలిపారు. కర్నూలులో 1994, 1999, 2004, 2009 ఎన్నికల్లో సిపిఎం తరపున ప్రచారం నిర్వహించారన్నారు. 2016లో కర్నూలులో సిపిఐ, సిపిఎం ప్రజా సమస్యలపైన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారన్నారు. 2019లో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్‌ను వ్యతిరేకిస్తూ కర్నూలులో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారని చెప్పారు సీతారాం ఏచూరి అంటే కార్యకర్తలకు ఎంతో ప్రేమ అభిమానాలని, అలాంటి వ్యక్తి మృతి చెందడం కర్నూలు జిల్లా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంద్యాల రఘుబాబు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంతాపాన్ని తెలియజేశారు. సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం పని చేస్తామని ప్రతిన బూనారు.



సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

రక్తహీనతను నివారించాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గజ్జెల వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళలు, చిన్నారులు, గర్భిణులల్లో రక్తహీనత నివారించేందుకు మహిళా శిశుసంక్షేమ శాఖ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ గజ్జెల వెంకలక్ష్మి అన్నారు. గురువారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో '7వ రాష్ట్రీయ పోషణ్ మాహ్-2024' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహిళా కమిషన్ చైర్మన్ గజ్జెల వెంకట లక్ష్మి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న అనేక మంది మహిళలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయన్నారు. జాతీయ మహిళా కమిషన్ రక్తహీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు, అనీమియా తక్కువ శాతం ఉంటున్న జిల్లాలను గుర్తించి అక్కడ సమావేశాలు నిర్వహించి చైతన్యం చేస్తామన్నారు. టేక్ హోమ్ రేషన్ పక్కాగా అందేలా చూడాలని కోరారు. జెసి మాట్లాడుతూ కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాజెక్టు పరిధిలో వయస్సు తగ్గ బరువు లేకపోవడం, అనీమియాతో బాధపడుతున్న గర్భిణులు ఈ జిల్లాలోనే ఎక్కువగానే ఉన్నారన్నారు. సిడిపిఒలు, ఐసిడిఎస్ పిడి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పది మంది గర్భిణులకు ఛైర్మన్, జెసి, సిడబ్ల్యుసి కమిటీ చైర్మన్‌లు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి కమిటీ చైర్మన్ జుబేదా బేగం, మహిళ, శిశుసంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మి, సమగ్ర శిక్ష జిసిడిఓ ఒ.స్నేహలత, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సులోచన, పిడియాట్రిక్స్ వైద్యులు ప్రకాష్ కుమార్, నర్మద, డిప్యూటీ డిఇఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నగదు వసూలు చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


ఆరోగ్య శ్రీ కింద పేషెంట్ల నుండి నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. గురువారం కర్నూలు నగరంలోని ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ క్రింద వస్తే ఉచితంగా చికిత్స ఇవ్వాలని లేకపోతే అప్పుడు వారి నుండి నగదు తీసుకునే ప్రక్రియను అన్ని ఆసుపత్రులు పాటించాలన్నారు. ఆసుపత్రుల ఫిర్యాదులను కేసు వారీగా రివ్యూ చేస్తూ పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ నుంచి తొలగించిన ఆసుపత్రులపై ఏమైన కేసులు ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

బ్రిడ్జ్ కమ్ బ్యారేజీపై వివరణ ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా పరిధిలోని తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం రెండు చోట్ల బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని ప్రతిపాదనను ముందుకు తీసుకు వచ్చిందని, దాని వల్ల కర్నూలు జిల్లాకు ఎలాంటి మేలు చేకూరుతుందో రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, కెవి.నారాయణలు ఇరిగేషన్ సిఈ కబీర్ పాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ బుధవారం కర్నూలు అతిథి గృహంలో కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి కర్నూలు జిల్లా ఇరిగేషన్ అధికారులతో కర్నూలు ఎంపీ నాగరాజుతో కలిసి సమావేశం నిర్వహించడం దేనిని సూచిస్తుం దన్నారు. ఇది అధికారిక సమావేశమా..? అనధికారిక సమావేశమా.? అనేది ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో వచ్చిన అంశాలను చూస్తే కర్ణాటక ప్రభుత్వం నిర్మించబోతున్న బ్రిడ్జి కం బ్యారేజ్ వల్ల కర్నూలు జిల్లాకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ముందే మేల్కొని కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకించి కర్నూలు జిల్లాకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లాలో కౌతాళం మండలం మేలిగనూరు దగ్గర వరద కాలువ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఎడారిగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇరిగేషన్ సిఈకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, జి.రామకృష్ణ

14న కోర్టుల్లో లోక్ అదాలత్

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, ఆయా కోర్టుల్లో ఈనెల 14న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

'రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి'

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఈనెల 14, 15న విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగే 49వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా యోగా సంఘం ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు. గురువారం కర్నూలు బస్టాండ్ వద్ద రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, జిల్లా సంయుక్త కార్యదర్శి సాయి కృష్ణ, కోశాధికారి ఈశ్వర్ నాయుడు, మునిస్వామి, శశిధర్, రమణమూర్తి, గణేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇసుక అందిస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని సింగవరం, ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లో ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ విజయశ్రీ తెలిపారు. గురువారం రీచ్‌ల వద్దకు వెళ్లి రసీదులు, సీరియల్ లిస్టులను తనిఖీ చేశారు. ఇక్కడే టిప్పర్లకు, ట్రాక్టర్లకు, నియమిత టన్నుల ప్రకారం వేయాలని, తెలిపారు. విఆర్ఒలు శేఖర్, శ్రీనివాసులు ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పత్తికొండ

విజయవాడ వరద బాధితుల కోసం పత్తికొండ నియోజకవర్గంలోని ప్రజల నుంచి సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్ అందజేశారు. గురువారం విజయవాడ సెక్రటరియేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ రూ.23 లక్షల చెక్కును అందజేశారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టిజి.భరత్, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నాయకులు నాగేశ్వరరావు యాదవ్, తుగ్గలి నాగేంద్ర, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

వర్సిటీకి గుర్తింపు తేవాలి : వీసీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు కష్టపడి చదివి వర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని క్లస్టర్ వర్సిటీ వీసీ డివిఆర్.సాయి గోపాల్ తెలిపారు. గురువారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం నిర్వహించా రు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ... విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

22 వరకు గడువు పొడగింపు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన గడువును ఈనెల 22 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ గడువులోపు అన్ని శాఖల్లో ఉద్యోగుల బదిలీలను పూర్తి చేయాలని ఆదేశించింది. ఈనెలాఖరులోగా ఎక్సైజ్ శాఖలో బదిలీలను పూర్తిచేయాలని పేర్కొంది.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు రామచంద్రుడు, చంద్రన్నతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 43 వేల ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేశారని తెలిపారు. వర్షాలు ఎక్కువగా కురవడంతో ఉల్లి వేరు కుళ్లిపోయి, పైన తెగులు వచ్చి పంట దిగుబడి తగ్గిందన్నారు. ధరలో కూడా వ్యత్యాసం పలుకుతోందని చెప్పారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో ఉల్లి పంట అత్యధికంగా సాగవుతుందని తెలిపారు. అతివృష్టి, అనావృష్టితో పంట దిగుబడి లేక, ధర లేక ఉల్లి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఈఏడాది అధిక వర్షాలతో వేర్లు కుళ్లిపోవడం తెగులు వచ్చి దిగుబడి తగ్గి ధర పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఉల్లి ధర తక్కువ పలికిన వారికి టిడిపి ప్రభుత్వం బోనస్ రూపంలో చెల్లిస్తుందని వాగ్దానం చేశారని, అధికారులు నివేదికలు కూడా పంపారని తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ఒక్క పైసా చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా ఆలోచించి నష్టపోయిన రైతులందరికీ నష్టం కింద బోనస్ రూపంలో చెల్లించాలని కోరారు. లేకపోతే ఉల్లి రైతులందరినీ కూడగట్టి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.



రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

17 నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను గురువారం ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

15న కర్నూలు నగరంలో జరిగే గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జెసి డాక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గణేష్ నిమజ్జనంపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలని కోరారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా చూడాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఇన్‌ఛార్జీ డిఆర్ఒ చిరంజీవి, ఆర్‌డిఒ శేషిరెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా ప్రెసిడెంట్ వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు జి.వెంకటేష్, తిమ్మన్న, సుధాకర్, శ్రీనివాసరెడ్డి, మోక్షేశ్వరుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరిత ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని బిర్లా గేట్ పోస్టాఫీసు, ముజఫర్ నగర్, కల్లూరు, ఓల్డ్ టౌన్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీల్లో వినాయక మండపాల్లో ఎమ్మెల్యే గౌరు చరిత గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేపట్టారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

- డాక్టర్ హుస్సేన్ సాహెబ్

ప్రజాశక్తి - మద్దికెర

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించేందుకే కృషి చేస్తామని డాక్టర్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. గురువారం మద్దికెరలోని మెయిన్ బజార్‌లో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను పి, బి బీఎస్సీ నర్సింగ్ కోర్స్ చదవడం వల్ల వైద్య సేవల పట్ల పూర్తిగా అవగాహన ఉందన్నారు. మహారాష్ట్రలో 8 ఏళ్లపాటు వన్‌లెస్ ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లో, ఐదేళ్లు పద్మావతి నర్సింగ్ హోమ్‌లో ఉంటూ శిక్షణ పొందానని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సమస్యలుంటే తమ క్లినిక్‌ను సంప్రదిస్తే ప్రథమ చికిత్సలు చేసి వైద్య సేవలు అందిస్తామన్నారు. మెరుగైన వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలనే విషయంపై కూడా వివరిస్తామన్నారు. అనంతరం ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేశారు.

బాధితులను ఆదుకోవాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని నారాయణ కళాశాలల్లో విద్యార్థులతో గురువారం విరాళాలు సేకరించారు. విద్యార్థులు స్పందించి రూ.17,200 విరాళం ఇచ్చారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప తెలిపారు. సర్వం కోల్పోయి ఇబ్బందుల్లో బాధితులకు విరివిగా విరాళాలిచ్చి ఆదుకోవాలని కోరారు. డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాషా, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్, నాయకులు హర్ష, మనోహర్, చింటు, తరుణ్ పాల్గొన్నారు.

ఎపిఎంకు బ్యాంకు అధికారుల సన్మానం

ప్రజాశక్తి - మద్దికెర

ఎపిఎం మధు బాబును సన్మానించినట్లు కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, బ్రాంచి మేనేజర్ వెంకటేష్ తెలిపారు. గురువారం మద్దికెరలోని కెనరా బ్యాంకులో ఎపిఎం మధు బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎపిఎం మధుబాబు జీవనోపాధులు, ప్రోత్సాహకాలపై మహిళలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మద్దికెరలో ఇద్దరు, గురుజులలో ఒక నిరుద్యోగిని ప్రోత్సహించి పప్పు శనగల మిషన్, వక్క ప్లేట్ మిషన్‌ను ఇప్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. జీవనోపాధుల కింద మహిళలకు కుట్టు మిషన్, పిండి మిషన్, చెరుకు మిషన్, ఎనుములు తదితర రకాల పోషకాలు అందించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికీ, బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పిస్తామని పేర్కొన్నారు.



ఎపిఎంను సన్మానిస్తున్న అధికారులు

ప్రజలకు సేవలందించాలి

- జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకుని, వారికి అన్ని విధాలుగా సేవలు అందించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. గురువారం ఆయన జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో అందిస్తున్న సేవలు, కలిపిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా పార్కింగ్, టాయిలెట్స్ సమస్య తీవ్రంగా ఉందని ఆయనకు తెలిపారు. అనంతరం జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వర రావుతో సమావేశమైన ఎంపీ నాగరాజు మాట్లాడారు. కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు అన్ని వసతులు కల్పించాలని కోరారు. జనసేన కర్నూలు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అర్షద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వరద బాధితుల సహాయార్థం రూ.11 లక్షలను అందజేశామని కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విజయవాడలోని సచివాలయంలో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.11 లక్షల చెక్కును ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డితో కలిసి అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చినందుకు మంత్రి లోకేష్ ఆయనను అభినందించారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

- కమిషనర్ రామలింగేశ్వర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని కమిషనర్ పివి.రామలింగేశ్వర్ తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కమిషనర్ రామలింగేశ్వర్ ప్రారంభించారు. అన్నదానం ఒక మహత్కార కార్యమని, అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదని కమిషనర్ పేర్కొన్నారు. మేనేజర్ చిన్నరాముడు, సీనియర్ అసిస్టెంట్లు రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మైనారిటీ సంక్షేమాధికారి బదిలీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మైనారిటీ సంక్షేమ శాఖాధికారి సునీల్ కన్నాను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మైనార్టీ కార్పొరేషన్ ఇడి సబిహా పర్వీన్‌ను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.



మాట్లాడుతున్న రాఘవేంద్ర చౌదరి

వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యత

- కెవికెలో అగ్రి ఇంజనీరింగ్ విద్యార్థుల విజ్ఞాన క్షేత్ర పర్యటన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యత, వాటితో ఎరువులు, సూక్ష్మపోషకాలు, పురుగు మందులతో పాటు కచ్చితత్వంతో విత్తనం వేసేందుకు ఉపయోగపడుతున్నాయని వక్తలు తెలిపారు. గురువారం మడకశిర వ్యవసాయ అగ్రి ఇంజనీరింగ్ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు వ్యవసాయ విజ్ఞాన క్షేత్ర పర్యటనలో భాగంగా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. వ్యవసాయ అగ్రి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మంజుల, సహాయ ఆచార్యులు డాక్టర్ నటరాజ్ ఈ సందర్భంగా బనవాసి కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో డ్రోన్ పరిజ్ఞానం రూపొందించాలని, రైతుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన మాట్లాడుతూ... కెవికెల ప్రాముఖ్యత, విస్తరణ విధులు, వ్యవసాయ సాంకేతికత విస్తరణలో కెవికెల ప్రాముఖ్యత, అగ్రి ఇంజనీరింగ్ అంకుర సంస్థల పథకాల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానిక మాట్లాడుతూ... మిరప, ఉల్లి పెంపకంలో మెళకువలు, చీని, దానిమ్మ, సపోటా తోట పంటల్లో రకాలు, అజొల్లా పెంపకం, షేడ్ నెట్ నారు మొక్కల పెంపకం గురించి వివరించారు.

చెత్త సంపద కేంద్రాలను ప్రారంభించాలి

- డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - గోనెగండ్ల



ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ చెత్త సంపద తయారీ కేంద్రాలను తిరిగి ప్రారంభించి అక్టోబర్ 2లోపు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. గురువారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీని తిరిగి ప్రారంభించాలని, వచ్చే నెల రెండులోపు పూర్తిస్థాయిలో ఫంక్షనింగ్‌లోకి వచ్చేలా చూడాలని తెలిపారు. అలాగే ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి పంచాయతీలో ర్యాలీలు, మానవహారాలు, శ్రమదానం, చెత్త కుప్పల తొలగింపు, నీటి వివరణల ప్రాముఖ్యత, మొక్కలు నాటడం చేపట్టనున్నామని తెలిపారు. సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- ఉద్యాన శాఖాధికారి శ్రీవాణి

ప్రజాశక్తి - నందవరం



ఆయిల్ పామ్ సాగుపై రైతులకు వివరిస్తున్న అధికారులు

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని మండల ఉద్యాన శాఖాధికారి శ్రీవాణి తెలిపారు. గురువారం నందవరంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టారు. రైతులకు వచ్చే సబ్సిడీ స్కీంల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడినిచ్చే పంట ఆయిల్ పామ్ అని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల సాగులో తీసుకోవాల్సిన మెళకువల గురించి ఎఒ స్రవంతి వివరించారు. చీడపీడలు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి బనవాసి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాఘవేంద్ర తెలిపారు. అగ్రికల్చర్ ఆఫీసర్ సురేంద్ర, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సుమంత్ పాల్ పాల్గొన్నారు.

సెపక్ తక్ర ఛాంపియన్‌షిప్‌కు ఆలూరు యువకుడు

ప్రజాశక్తి - ఆలూరు

జిల్లా సరిహద్దులో ఉన్న ఆలూరు నియోజకవర్గ కేంద్రం నుంచి కురువ మధు అనే యువకుడు అండర్-23 ఆసియా బీచ్ సెపక్ తక్ర ఛాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు సెపక్ తక్ర ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించినట్లు తెలిపారు. గురువారం సెపక్ తక్ర క్రీడాకారుడు కురువ మధు తల్లిదండ్రులు సరస్వతమ్మ, బసవరాజు మాట్లాడారు. అండర్-23 ఆసియా బీచ్ సెపక్ తక్ర పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 18 నుంచి 23 వరకు చైనాలోని కింగ్ డావోలో జరిగే ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

మంచి నాయకుని కోల్పోవడం బాధాకరం

- సిపిఎం సీనియర్ నాయకులు నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆలూరు

దేశం, సిపిఎం ఓ మంచి నాయకుని కోల్పోవడం బాధాకరమని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్ తెలిపారు. గురువారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం బాధాకరమని తెలిపారు. ఆయన ఆశయాలను నెరవేర్చాలని స్వామి చెప్పారు. సిపిఎం నాయకులు ఈశ్వర్ గౌడ్, ఆర్‌టిసి యూనియన్, మాజీ నాయకులు దాదా బాష, షేకున్ బీ, కృష్ణ, మైనా, గోవర్ధన్, రత్నమ్మ, భారతి, నాగరాజు, వీరేష్, విరల్, గోసెయ్యలీ, గిరిమల్లి, అకీరానంద పాల్గొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, మండల నాయకులు రాముడు, అబ్దుల్లా, యుటిఎఫ్ నాయకులు దావీద్, ఎల్లప్ప, నాగమణి, కౌలన్న, శంకరయ్య పాల్గొన్నారు.

దేవనకొండ : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మదిలేటి శెట్టి, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సీతారాం ఏచూరి మృతికి వారు సంతాపం తెలిపారు.



ఆలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యం

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చే భక్తుల సౌకర్యాల కల్పనే లక్ష్యమని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. గురువారం స్థానిక శ్రీమఠం నిర్వహణలో ఉన్న అన్నపూర్ణ భోజనశాల వద్ద విజయీంద్ర విశ్రాంతి భవనం, వివిజి, బృందావన గార్డెన్స్ వంటి మూడు ప్రదేశాల్లో దివి లేబొరేటరీస్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కొత్త నీటి శుద్ధి ప్లాంట్లను పండితుల వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తులకు శీఘ్ర దర్శనం, వసతి, తాగునీటి సౌకర్యం, మురుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలపై దృష్టి సారించామని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని భక్తులకు పంపిణీ చేశారు. దివి లాబొరేటరీస్ లిమిటెడ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నగేష్, శ్రీనివాస్, శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, ఇఇ శ్రీసురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతులు

ఎమ్మెల్యే బీవీని విమర్శించే అర్హత

గడ్డం నారాయణరెడ్డికి లేదు : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డిని విమర్శించే అర్హత ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డికి లేదని టిడిపి నాయకులు తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు మాట్లాడారు. వైసిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి ఎమ్మెల్యేను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ఒకనెల ముందు టిడిపి నుంచి వైసిపిలోకి వెళ్లారని, ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి నారాయణరెడ్డికి లేదని తెలిపారు. ఒక్కసారి కూడా ఎక్కడా పోటీ చేయని వ్యక్తులు విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని చెప్పారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు గురించి ఎమ్మెల్యేకు అవగాహన లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టును తెచ్చిన ఘనత బీవీ కుటుంబానికే దక్కుతుందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి, పబ్లిసిటీ కోసమే గడ్డం నారాయణరెడ్డి ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి రైతుకూ ఎమ్మెల్యేపై నమ్మకం ఉందని, ఎమ్మెల్యేను విమర్శించే ముందు ఆలోచించి మాట్లాడాలని చెప్పారు.



మాట్లాడుతున్న నాయకులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామానికి చెందిన రైతు మనీ సుంకన్న (38) అప్పుల బాధ తాళలేక గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మనీ సుంకన్న అప్పుల బాధలు తట్టుకోలేక గత నెల 27న పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందారు. మృతునికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మన్న తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

విజయవాడ వరద బాధితుల కోసం టిడిపి ఆధ్వర్యంలో విరాళా సేకరణ చేపట్టారు. గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి నాయకత్వంలో టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. డబ్బా పట్టుకుని తుంగభద్ర నదీతీరంలో ఉన్న దుకాణాలు, ప్రధాన రహదారిపై ఉన్న హోటళ్లు, దుకాణా దారుల నుంచి ఎంత వీలైతే అంత సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సేకరించిన విరాళాలను తమ నాయకుల ద్వారా చంద్రబాబు నాయుడుకు చేరుస్తామని తెలిపారు. ఎంపిటిసి సభ్యులు నక్కి వెంకటేష్, టిడిపి నాయకులు మేకల నరసింహ, శివ, బిబిసి చిన్న, రాఘవేంద్ర, డేవిడ్, ఈరన్న, హనుమప్ప పాల్గొన్నారు.

కౌతాళం : భారీ వర్షాలతో దెబ్బతిన్న విజయవాడ వాసులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కౌతాళం పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ కోరారు. గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విపత్తు నుంచి సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు పెద్ద ఎత్తున నిధులు అవసరమని తెలిపారు. టిడిపి నాయకులు మంజునాథ్, రహిమాన్, సిద్ధు, రాజాబాబు, రవికుమార్, చంద్రశేఖర్, పుగ్గి నాగప్ప, భీమయ్య, వెంకటేష్, గాబ్రెల్, చౌదరి సోమన్న పాల్గొన్నారు.

ఎరిగేరిలో...

మండలంలోని ఎరిగేరి గ్రామంలో ప్రజలు విరాళాలు అందజేశారు. టిడిపి మండల కార్యదర్శి రామలింగ, నాయకులు బసవరాజు, శ్రీరాములు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. గ్రామస్తులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రూ.63 వేలు, 15 క్వింటాళ్ల బియ్యం విరాళంగా అందించారు. గిడ్డయ్య, భీమన్న, సిహెచ్.రమేష్, గడిగె రమేష్, మార్క్, వీరేష్, అంజి, నాగరాజు, శాంతరాజు, రవి, అల్లప్ప పాల్గొన్నారు.

బాధితులకు ఉమాపతి నాయుడు చేయూత

ప్రజాశక్తి - ఆదోని

విజయవాడ వరద బాధితులకు తన వంతు సహాయంగా నిత్యావసర సరుకుల కిట్లు అందిస్తూ టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు దాతృత్వం చాటుకున్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఆదోని నుంచి 1000 నిత్యావసర కిట్లు తీసుకెళ్లి గురువారం విజయవాడలో అక్కడి నాయకులతో నేరుగా బాధితులకు పంపిణీ చేశారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ... విజయవాడలోని 54వ వార్డు ఊర్మిళ నగర్, గొల్లపూడి వీధి, భోజీ నగర్, భవానిపురం కాలనీల్లోని వరద బాధితులకు అందించామన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- దేవనకొండ

గత పది రోజుల క్రితం విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. గురువారం టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, కర్నూలు పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి గుండ్లకొండ రామదాసు గౌడ్ ఆధ్వర్యంలో కిట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజయవాడలోని భవానిపురం, వైఎస్ఆర్ కాలనీ వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరద బాధితులను ఆదుకోవడంలో చూపిన దాతృత్వం, సేవలు ప్రశంసనీయమన్నారు.



ఆదోని : కిట్లను పంపిణీ చేస్తున్న ఉమాపతి నాయుడు



మంత్రాలయం : విరాళాలు సేకరిస్తున్న నాయకులు



కౌతాళం : విరాళాలు సేకరిస్తున్న నాయకులు



దేవనకొండలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు



రహదారి బురదమయం

- ఇళ్లలోకి వర్షపు నీరు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని పెద్దగోనేహల్ గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలో రహదారి బురదమయంగా మారింది. దారి గుండా నడవడానికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ లేక, సిసి రోడ్లు లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. రహదారిపై నీరు నిలవడంతో గడ్డి మొలకలు పెరుగుతున్నాయని, ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రజలు, చిన్న పిల్లలు విషజ్వరాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. అధికారులకు, సర్పంచికి, ఎంపిటిసికి చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇంతవరకు ఒక్క అధికారి కానీ, సర్పంచి కానీ, ఎంపిటిసి కానీ స్పందించ లేదని మండిపడ్డారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి

ప్రజాశక్తి - హాలహర్వి



మండలంలోని చింత కుంట గ్రామంలో గురువారం 11కెవి విద్యుత్ తీగలు తగిలి దాసరి అర్జున్ (16) మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... దాసరి వెంకటేష్, సావిత్రమ్మలకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలను భవన నిర్మాణ పనులు చేసుకుంటూ చదివించుకుంటున్నారు. రెండోవాడు దాసరి అర్జున్ ఉదయం మేడపైకి ఎక్కగా అక్కడే ఉన్న 11కెవి విద్యుత్ తీగలు తగిలి పడిపోయారు. గుర్తించిన తల్లిదండ్రులు బళ్లారి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో అర్జున్ చనిపోయాడని గ్రామస్తులు మండిపడ్డారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న రాఘవేంద్రస్వామి నాలుగు విగ్రహాలకు పూలమాలలు వేసిన, అనంతరం మాజీ సర్పంచి గోర్కల్ కృష్ణస్వామితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్, చెట్నిహల్లి సర్పంచి అంజిని, ఉప సర్పంచి వీరనాగప్ప, నాయకులు శివకుమార్, లక్ష్మి రెడ్డి, వడ్డే నారాయణ, పి.రాము, జక్కయ్య, అబ్రహాం పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి ఆర్థిక సాయం

ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు అనాథాశ్రమానికి రూ.6 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని కాచాపురం గ్రామంలోని జ్యోతి అనాథాశ్రమం చేరుకున్న మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జగన్నాథ్ రూ.5 వేలు, రాజు రూ.వెయ్యి అనాథాశ్రమం నిర్వాహకులు ముత్తమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఫాస్టర్ సామ్యేలయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సంతోష్, పెద్ద చందా వలీ, గుంటప్ప పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

వరద బాధితులను ఆదుకుందాం

- మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేయి చేయి కలిపి విజయవాడ వరద బాధితులను ఆదుకుందామని సామాజికవేత్త, మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు కోరారు. గురువారం పట్టణంలోని లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం మణి మాధురి, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు వరద బాధితుల కోసం నిత్యావసర సరుకులను, కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే పట్టణంలోని బ్రాండ్స్ ఫ్యాషన్ అండ్ స్టైల్ బట్టల యజమాని కృష్ణారెడ్డి, ఆయన కుమారుడు దినేష్ రెడ్డి షాపులో వ్యాపారి నిమిత్తం పెట్టుకున్న బట్టలను బాధితుల కోసం అందజేశారు. మైసూర్ విప్రబాంధవ సంస్థ సభ్యులు గురురాజు రావు 100 కిలోల బియ్యం, కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడారు. విజయవాడ వరద బాధితుల కోసం సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముత్తు, సామ్యేల్, అజిత్, సతీష్, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సభ్యులు

నిమజ్జనానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు

- ఎంపిహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

వినాయక చవితి పండగ, వినాయక విగ్రహ నిమజ్జనం విజయవంతంగా, శాంతియుతంగా జరిపిన ప్రభుత్వాధికారులకు ఎంపిహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్ అహ్మద్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆదోనిలో ఆయన మాట్లాడారు. ఎక్కడా తప్పులు జరగకుండా పోలీసు శాఖ కృషి చేసిందని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించడంతో పని మరింత సులువైందన్నారు. ప్రజలు రాజకీయ నాయకుల మాయలో పడకుండా పండగను శాంతియుతంగా జరుపుకున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, ముఖ్యంగా కొత్తగా వచ్చిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కృషి అమోఘమన్నారు.

ప్రజలకు మరింత చేరువలో సేవలు

- స్టేట్ బ్యాంకు మేనేజర్ రవికుమార్

ప్రజాశక్తి - ఆలూరు

ప్రజలకు మరింత చేరువలో స్టేట్ బ్యాంకు సేవలు విస్తరిస్తామని మొలగవల్లి స్టేట్ బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మొలగవల్లి కొట్టాల గ్రామంలో ఎస్‌బిఐ కస్టమర్ సర్వీసు పాయింట్‌ను ప్రారంభించారు. గ్రామంలోనే బ్యాంకు సేవలు పొందవచ్చని తెలిపారు. సీఎస్పీ డిస్ట్రిక్ట్ మేనేజర్ వీరప్రసాద్, సీఎస్పీ పాయింట్ నిర్వాహకులు సుజాత, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో చేరండి..

త్వరగా ఉపాధి పొందండి...

- పద్మావతి పారా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ విరుపాక్షి

ప్రజాశక్తి - ఆదోని

పారా మెడికల్ కోర్సుల్లో చేరి పూర్తి చేసిన వారు సత్వరమే ఉపాధి అవకాశాలు పొందుతున్నారని పద్మావతి పారా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ విరుపాక్షి తెలిపారు. గురువారం కళాశాలలో కోర్సుల గురించి కళాశాల ప్రిన్సిపల్ రామలింగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాంప్రసాద్ రెడ్డితో కలిసి వివరించారు. తమ కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డిఎంఎల్‌టి), డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డిఎంఎస్‌టి), డిప్లొమా ఇన్ ఆప్తమాలిక అసిస్టెంట్ (డిఒఎ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ బైపిసి, ఎంపిసి పూర్తి చేసిన వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇంటర్ పూర్తి చేసిన వారు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ బాలికల హైస్కూల్ పక్కన ఉన్న పద్మావతి పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ 90140 66760 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని కల్లుబావి వద్ద లారీ ఢీకొన్న ఘటనలో గిడ్డయ్య అనే వ్యక్తి మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... గిడ్డయ్య గురువారం బహిర్భూమికి వెళ్లి రోడ్డు పై నుంచి ఇంటికి వెళ్తుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. కల్లుబావికి చెందిన గిడ్డయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు హమాలీ పని చేస్తూ జీవించే వారని, ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని స్థానికులు కోరారు. డ్రైవర్‌ను పట్టుకొనేలోపు పరారయ్యాడని అన్నారు. ప్రమాద స్థలంలో విచారణ చేపట్టి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'కూలిన కల్వర్టును నిర్మించాలి'

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం, బదినేహాల్ గ్రామాల మధ్య కూలిపోయిన కల్వర్టును నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. గ్రామాల మధ్య ఉన్న రోడ్డును గురువారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్వర్టు కూలిపోవడంతో విద్యార్థులు, ప్రజలు, రైతులు కౌతాళానికి రావాలంటే ఎరిగేరి మీదుగా వస్తున్నారని తెలిపారు. గ్రామాల మధ్య కేవలం 6 కిలోమీటర్లు ఉండగా, గ్రామానికి చేరుకోవడానికి 14 కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉందన్నారు. బదినేహాల్ నుంచి కౌతాళం వరకు రోడ్డుకు అడ్డంగా ముళ్లకంపులు పెరిగి పోవడంతో వాహనాలు కూడా తిరగడానికి ఇబ్బందిగా ఉందన్నారు. ముందు వచ్చే వాహనాలు కనపడక చాలాసార్లు ప్రమాదాలు జరిగిగాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్లకంపలను తొలగించి కల్వర్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కన్వీనర్ బి.ఈరన్న, నాయకులు ఉల్లిగయ్య, ఈరన్న, చంద్ర, శంకర్ పాల్గొన్నారు.